## క్లుప్తంగా

### తహసీల్దార్‌కు అభినందనలు


కలెక్టర్ సూర్యకుమారి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

డెంకాడ: ఉత్తమ తహసీల్దార్‌గా ఎంపికై కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్న పి. ఆదిలక్ష్మికి కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టర్ సూర్యకుమారి చేతులమీదుగా జిల్లా కేంద్రంలో గురువారం అవార్డు అందుకున్నారు. దీంతో రెవెన్యూ కార్యాలయం సిబ్బంది, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు శుక్రవారం ఆమెను అభినందించారు.

### సచివాలయ సిబ్బందికి మెమోలు


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి సచివాలయం–2ను ఎంపీడీఓ జి.రామారావు శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయం వీఆర్‌ఓ, రైతుభరోసా కేంద్రం వ్యవసాయ సహాయకుడు విధులకు గైర్హాజరు కావడంతో మెమోలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ చేయూత దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం శుక్రవారంతో ముగుస్తుందని చెప్పారు. వలంటీర్లు తప్పనిసరిగా హాజరు వేయాలని సూచించారు. ఆయనతో పాటు ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు ఉన్నారు.

### ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన


పాడి రైతులకు నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తున్న పశు వైద్యులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్యశిబిరానికి స్పందన లభించింది. పశువులకు గొంతువ్యాపు, జబ్బవాపు వ్యాధి రాకుండా టీకాలు వేశారు. ఎదకురాని 42 పాడి పశువులకు, గర్భ సంబంధ వ్యాధిగ్రస్త పాడి పశువులకు కూడా చికిత్స అందజేశారు. అనంతరం 14 లేగ దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశా రు. పాడి పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే సచివాలయ పశు సంవర్ధక సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద లు అంబళ్ల బుచ్చినాయుడు, దురగాశి రాంబాబు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న రేలారే రేలా



పాటలు పాడుతున్న కళాకారులు

వేపాడ: మండలంలో బల్లంకి గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి తీర్థం వైభవంగా జరుగుతోంది. రెండో రోజు శుక్రవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన రేలారే రేలా కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శనివారం సాయంత్రం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### కలశాల ఊరేగింపు

గజపతినగరం: పట్టణంలోని శ్రీపైడితల్లి అమ్మవారి ఆలయ శిఖర ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా శుక్రవారం సాయంత్రం కలశ ప్రదర్శన చేపట్టారు. స్థానిక శ్రీరామదూత సేవాసంఘం ఆధ్వర్యంలో మహిళలు తలపై కలశాలు ధరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వాటిని సమర్పించి మొక్కులు చెల్లించారు. శనివారం ఆలయ శిఖర ప్రతిష్ఠ, ఆదివారం అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

శృంగవరపుకోట: శివరాత్రి జాతర ఏర్పాట్లపై చర్చించేందుకు పుణ్యగిరి ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పి.రామకృష్ణ నేతృత్వంలో ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక దార గంగమ్మ ఆలయ ప్రాంగణంలో సమావేశమయ్యారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని, మరుగుదొడ్లు, స్నానపుగదులు, పుట్టుదార వద్ద స్నానాలు చేసేవారి కోసం షవర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 5న నిర్వహించే శివపార్వతుల కల్యాణోత్సవం ఏర్పాట్లపై సమీక్షించారు. సమావేశంలో ఈఓ నాగేంద్ర, డైరెక్టర్లు సత్యసాయి, కె.శ్రీనివాసరావు, శ్రీరామ్మూర్తి, వై.ఈశ్వరరావు, అర్చకులు రాజగోపాలాచార్యులు, మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సహస్ర దీపాలంకరణ..

పవిత్ర పుణ్యక్షేత్రమైన రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సీతారామచంద్రస్వామిని అర్చకులు నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దనున్న ప్రాంగణ వేదిక వద్దకు తీసుకెళ్లారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక ఊయల్లో స్వామి వారిని ఉంచి ఊంజల్ సేవ నిర్వహించారు.

– నెల్లిమర్ల రూరల్



## దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట



చిన్నారులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో 9 మంది చిన్నారులకు ప్రభుత్వం సమకూర్చిన రొలెటర్స్, వీల్‌చైర్స్, సీపీ చైర్స్, ట్రై సైకిల్, వినికిడియంత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం దివ్యాంగులకు ఉపకరణాలను అందిచడమే కాకుండా పింఛన్, ఉచిత బస్‌పాస్ వంటి సౌకర్యాలను కల్పిస్తూ దివ్యాంగులు సంక్షేమానికి కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఎంఈఓ రమణమూర్తి, ఏపీఎం రమణ, హెచ్‌ఎం పార్వతి, డీవీ.రమణరాజు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### చెల్లూరులో సినీ నటుడు సుమన్ సందడి


కరాటే క్రీడాకారులు, నిర్వాహకులతో సినీనటుడు సుమన్

విజయనగరం రూరల్: మండల పరిధిలోని చెల్లూరులో సినీ నటుడు సుమన్ శుక్రవారం సందడి చేశారు. గ్రామంలో కరాటే క్లబ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సుమన్‌కు నిర్వాహకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నటుడు సుమన్ మాట్లాడుతూ, క్రీడలు మానసిక శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కరాటే క్రీడ ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని చెప్పారు. బాలబాలికలు ఈ క్రీడను నేర్చుకోవాలని సూచించారు. కరాటే ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రేక్షకుల అభిమానంతోనే ఎన్నో చిత్రాల్లో నటించి, మెప్పించగలిగానన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నేడే రథసప్తమి


ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి


పాలు పొంగించేందుకు పొయ్యిలు ఏర్పాటు చేసుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: బాబామెట్ట ఏడుకోవెళ్లలో కొలువైన సూర్యదేవాలయంలో శనివారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. ఏడాదికి ఒకసారి మాత్రమే స్వామివారి మూల విరాట్ విగ్రహానికి జరిగే అరుదైన అభిషేకం, అనంతరం స్వామివారి విగ్రహాన్ని సూర్యకిరణాలు తాకే కమనీయ దృశ్యాన్ని భక్తులు తిలకించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు. ఆలయ ఆవరణలో పాలు పొంగించేందుకు భక్తులు ఏర్పాట్లు చేసుకున్నారు.

## క్రీడాకారుడు అమన్ షేక్‌కు అభినందనలు


షేక్ అమన్‌ను సత్కరిస్తున్న విజయనగరం సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలో వరుస విజయాలు సాధిస్తున్న విజయనగరానికి చెందిన క్రీడాకారుడు అమన్ షేక్‌ను విజయనగరం సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎంకేబీ శ్రీను, కార్యదర్శి ఎస్.సురేష్, విజయనగరం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వై.కుసుంబచ్చన్‌లు క్రీడాకారుడ్ని అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, 2023 సంవత్సరంలో శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో జరిగిన మూడు టోర్నీలలో వరుస విజయాలు సాధించి విజయనగరం జిల్లా సత్తా చాటి చెప్పిన అమన్ షేక్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

విజయనగరం పూల్‌బాగ్: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్ట కాల పరిమితిని పదేళ్లకు పొడిగించినందుకు గాను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి అంబేడ్కర్ అందరివాడు సాధన సమితి ప్రతినిధులు ధన్యవాదాలు తెలియజేశారు. నగర పాలక సంస్థ పరిధిలో గల ఏనుగు రాయి కాలనీ, బొంగవీధి అంబేడ్కర్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రికి అనుకూలంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బొంగ భానుమూర్తి, మల్లన సంతోష్, మధుసూదనరావు, పొట్నూరు చంద్రశేఖర్, తమరాపు రామకోటి, గంట వీర్రాజు, జలగడుగుల రాజ్‌కుమార్, నాగేశ్వరరావు, సూరిబాబు అలమండ, తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీలో రోడ్డు భద్రత వారోత్సవాలు

శృంగవరపుకోట: మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు సంభవిస్తాయని, ప్రమాదాల నివారణకు నిత్యం జాగరూకులై ఉండాలని ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో రహదారి భద్రత వారోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై ప్రయాణికులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

## ఘనంగా తాజుద్దీన్ బాబా జయంతి


చాదర్ సమర్పిస్తున్న ఖాదర్‌వలీ బాబా ఆలయ ధర్మకర్త డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్, తదితరులు

విజయనగరం టౌన్: బాబామెట్టలో కొలువైన హజరత్ ఖాదర్‌వలీ బాబా దర్గాలో హజరత్ తాజుద్దీన్ బాబా 162వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఖాదర్‌వలీ బాబా ఆలయ ధర్మకర్త డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్ ఆధ్వర్యంలో బాబా నామాన్ని స్మరిస్తూ భారీ కేక్ కట్ చేశారు. ఖాదర్ బాబాకు చాదర్ అత్తర్ సమర్పించి వేలాది మంది భక్తులకు దర్బార్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అహమ్మదుల్లా షరీఫ్, సిద్దిక్, నయీమ్, లింగం రవిబాబు, అవసరాల సంతోష్, శ్రీధర్, రఘుపాత్రుని రవి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### గోపుర పూజ


ఆలయ శిఖరంపై పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని బి.రాజేరు గ్రామంలో శ్రీదుర్గా మల్లేశ్వర సమేత గణపతి సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ గోపురంపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోపురంపై ధాన్యం, బూరెలు వేసి పూజలు చేశారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి


సఖీ గ్రూపు ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ సిరి

• స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ సిరి

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: కిశోర బాలికలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని మహిళా శిశు, సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఎ. సిరి సూచించారు. మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు బలమైన ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరిగిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో 9 నుంచి 21 ఏళ్ల లోపు బాలికలను గుర్తించి సఖి గ్రూపులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని థామస్‌పేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, లబ్ధిదారులతో మాట్లాడారు. కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ చిన్మయిదేవి, పీడీ శాంతకుమారి, సీడీపీఓ సత్యవతి పాల్గొన్నారు.

## డ్రైవర్లకు వైద్య పరీక్షలు తప్పనిసరి

• రూరల్ సీఐ తిరుపతిరావు


డ్రైవర్లకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విజయనగరం క్రైమ్: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక వై జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో వంద మందికి పైగా డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు మాట్లాడుతూ, రహదారి ప్రమాదాలను నియంత్రించాలంటే డ్రైవర్లకు దృష్టిలోపం ఉండకూడదన్నారు. చాలా మంది డ్రైవర్లు తమ కళ్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రాథమిక స్థాయిలో వైద్యం పొంది, దృష్టి లోపాలను సరిచేసుకోకపోవడం వల్ల శాశ్వతంగా దృష్టిని కోల్పోతున్నారన్నారు. రూరల్ ఎస్సై గణేష్ మాట్లాడుతూ, వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, అలాగే అన్నిరకాల పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు రాజేశ్వరరావు, సురేష్ , పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మెరుగైన బోధన అందించాలి..

• డీఈఓ లింగేశ్వరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల బోధనాభ్యసనం మెరుగుపడేలా ఉపాధ్యాయులు బోధన అందించాలని డీఈఓ లింగేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలానికి చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులంతా తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల స్థాయిని అనుసరించి, బోధన అందించాలన్నారు. లెస్సన్, పిరియడ్ ప్లాన్లకు అనుగుణంగా బోధన తప్పనిసరని స్పష్టంచేశారు. బోధన సక్రమంగా లేని ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలకు చెందిన రికార్డులు, రిజిస్టర్లు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. జగనన్న గోరుముద్ద నిర్వహణపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. అన్ని పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలను దిద్ది, మార్కులను ఆన్‌లైన్లో పొందుపరచాలని డీఈఓ సూచించారు.

## విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

• ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకమని మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యారంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నాడు-నేడు, జగనన్న విద్యాకానుకలు, జగనన్న గోరు ముద్ద, తరల్, అభ్యాసన అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులకు సక్రమంగా అందజేసి, వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ, అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలుంటే వాటిని గ్రామ సర్పంచ్‌లు, స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ల ద్వారా తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే వాటిని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఎంఈఓ రమణమూర్తి ఏపీఎం రమణ, హెచ్‌ఎం పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఘటాలకు ఎమ్మెల్యే పూజలు


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో బంగారమ్మతల్లి గుడి పునఃప్రతిష్ఠా కార్యక్రమంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య శుక్రవారం పాల్గొన్నారు. సర్పంచ్ బేత శ్రీదేవి, రవి దంపతులు ఆయనకు స్వాగతం పలికారు. వేదపండితులు సంతోష్‌కుమార్ శర్మ ఎమ్మెల్యేతో అమ్మవారి ఘటాలకు పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచనాలు అందజేశారు. శనివారం రథసప్తమి సందర్భంగా గుడి గోపురంపై పూర్ణకలశాన్ని ప్రతిష్టించనున్నారు.

**30 నుంచి రామాలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు**

దత్తిరాజేరు: ఆర్.రామచంద్రాపురంలో ఈనెల 30 నుంచి రామాలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో తొలి రోజు యాగశాల ప్రవేశం, లఘువాస్తు హోమం, ప్రధాన దేవతా ఆవాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.